సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 21 । ఆగస్టు । 2025

గరిష్టం/కనిష్టం
31.0/24.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

పర్యావరణ హితాయ.. పార్వతి తనయా



గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో మట్టి ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. కళాకారులు విభిన్న రూపాల్లో పార్వతి తనయున్ని తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణహితంగా ప్రతిష్టించేందుకు జనం సైతం మొగ్గు చూపుతున్నారు.

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సలోని

ఆదిలాబాద్‌టౌన్: ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. రిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్‌పై మెడికోలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ఎంబీబీఎస్ సీటు కోల్పోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదవుతాయని, అలాగే జైలు, జరిమానాలు తప్పవన్నారు. సీనియర్లు జూనియర్ల పట్ల స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే హెల్ప్‌లైన్ నంబర్ 1800 180 5522 కు సమాచారం అందించాలన్నారు. అలాగే రిమ్స్ డైరెక్టర్‌తో పాటు మెంటర్‌కు సైతం సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు ఎన్‌ఆర్‌సీతో పాటు రిమ్స్‌లోని పలు వార్డులను పరిశీలించారు. ఆమె వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు విద్యావిల్సన్, సరోజ, రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్, నరేందర్ బండారి, కరుణాకర్, రఘునాథ్‌రావు, మెడికోలు పాల్గొన్నారు.

నష్టంపై నివేదిక అందించాలి

ఇంద్రవెల్లి: భారీ వర్షాలతో చోటు చేసుకున్న వరద నష్టంపై నివేదిక అందించాలని డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. భారీ వర్షాలతో కోతకు గురైన రోడ్లు, కల్వర్టులు, వరద నీరు చేరిన ఇళ్లు, విరిగిపడ్డ విద్యుత్ స్తంభాల వివరాలతో నివేదిక అందించాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఇందులో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘ఓపెన్’ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఖుష్బూ గుప్తా ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాద రుసుము లేకుండా ఈనెల 21 వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీ జు చెల్లించవచ్చని పేర్కొన్నారు. నిర్ణీత అపరాద రుసుముతో ఈ నెల 26 నుంచి 31వరకు గడువు ఉందని తెలిపారు. వివరాల కోసం అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎంపీ



సీపీ రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ఎంపీ

ఆదిలాబాద్: ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపీ గోడం నగేశ్ బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు తదితరులున్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పక్కాగా అంచనా వేసేలా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు ఆదేశించారు. పట్టణ పరిధిలో వరదనష్టం అంచనా వేసేందుకు చేపట్టనున్న సర్వేపై బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వర్క్‌ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రతీ ఇంటిని సందర్శించి జరిగిన నష్టాన్ని గుర్తించాలన్నారు. ధ్వంసమైన రోడ్లు, తెగిపోయిన వంతెనల వివరాలు నమోదు చేయాలన్నారు. రెండు రోజుల్లోగా వార్డుల వారీగా నష్టం నివేదికలు అందించాలని ఆదేశించారు. ఇందులో ఆదిలాబాద్ అర్బన్ మండల ప్రత్యేకాధికారి జక్కుల శ్రీనివాస్, డీఈ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీగా ఖమర్ హైమద్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎండీ ఖమర్ హైమద్ నియామకమయ్యారు. గతంలో ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఈయనను పీడీగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీ కానుంది.

వరదపై ఫోకస్



ఇది జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీ. దస్నాపూర్ వాగును ఆనుకొని ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ పలు ఇళ్లు నీట మునిగాయి. రెస్క్యూ సిబ్బంది రంగంలోకి దిగి అందులో నివసిస్తున్న వారిని బయటకు తీసుకువచ్చారు. ఏళ్లుగా సుభాష్‌నగర్‌లో వాగు బఫర్‌జోన్ ప్రాంతాన్ని ఆక్రమించి ఎడాపెడా నిర్మాణాలు చేపడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ ప్రభావమే తాజా వరదలు అనే అభిప్రాయం పట్టణవాసుల్లో వ్యక్తమవుతుంది.

- జిల్లా కేంద్రంలో నీట మునిగిన పలు కాలనీలు
- కారణాలపై యంత్రాంగం ఆరా
- నేటి నుంచి సర్వే షురూ

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో సాధారణంగా భారీ వర్షాలు కురిసినప్పుడు మురికి వాడల్లో వరద ప్రభావం కనిపించేది. అయితే అక్కడ సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే కారణం. ఇప్పుడు మాత్రం పలు కొత్త కాలనీల్లోనూ ఇళ్లు నీట మునగడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రధానంగా రెండు దశాబ్దాలుగా కొత్త లేఅవుట్లలో విస్తృతంగా భవనాల నిర్మాణాలు అవుతున్నాయి. అటువంటి చోటే వరదలు చుట్టుముట్టడం విస్తుగొలుపుతోంది. అ లాంటిదే సుభాష్‌నగర్. దీంతోపాటు మణిపూర్ కాలనీ, ఖోజా కాలనీ, గ్రీన్‌సిటీ, జీఎస్ ఎస్టేట్.. ఇలా పలు భవంతులు ఉన్న కాలనీల్లో మొదటి అంతస్తు పూర్తిగా మునిగేలా వరదలు రావడం గమనార్హం.

కబ్జాల నేపథ్యంలోనే..

జిల్లా కేంద్రంలోని పలు చెరువులు, వాగుల సమీపంలో బఫర్ జోన్‌లో నిర్మాణాల నిషేధం ఉన్నప్పటికీ ఇష్టారీతిన స్థలాలను కబ్జా చేశారు. భవనాలను నిర్మించారు. డూప్లెక్స్‌ల నిర్మాణాలు కూడా ఉన్నాయి. భారీ వర్షం కురిసినప్పుడు ఈ బఫర్ జోన్‌లో వరదలు ముంచెత్తుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షానికి గ్రీన్ సిటీని వరదలు ముంచెత్తాయి. తాజాగా కురిసిన వర్షాలతో దీంతోపాటు ఇతర కొత్త కాలనీల్లోనూ ఇదే తరహా వరదలు చుట్టుముట్టడం వెనుక కబ్జాలే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా డ్రెయినేజీ వ్యవస్థను ఇష్టారీతిన కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరు పారేందుకు కూడా సరైన వ్యవస్థ లేక ఇళ్లలోకి చేరుతోంది. ఈ వరదలను అంచనా వేసి కబ్జాలను తొలగిస్తేనే రానున్న రోజుల్లో ఇలాంటి ముప్పు తలెత్తదన్న అభిప్రాయం పట్టణవాసుల్లో వ్యక్తమవుతుంది.

నేటి నుంచి సర్వే..

పట్టణంలోని కాలనీల్లో ఈ వరదలెందుకు వచ్చాయి.. కారణం ఏమిటి.. డ్రెయినేజీలు లేవా.. ఉంటే ఎందుకు పొంగాయి.. లేనిపక్షంలో డ్రెయినేజీలు కబ్జాకు గురయ్యాయా.. పూడిక తియ్యలేదా.. వీటిని కబ్జా చేసి నిర్మాణాలు కట్టారా.. దీనిపై ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా బృందాలుగా ఏర్పాటు చేసి గురువారం నుంచి సర్వే చేయనున్నారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. దీంతో ఇప్పుడు ఆయా కాలనీల్లో వరదలకు కారణమేమిటనే చర్చ మొదలైంది. ఈ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వస్తా యా.. హైడ్రా వంటి సంస్థలను రంగంలోకి దించుతారా.. లేనిపక్షంలో కబ్జాల విషయంలో ఎలాంటి చర్యలకు దిగుతారోననే దానిపై చర్చగా సాగుతోంది.

నీట మునిగిన కాలనీలు..

జిల్లా కేంద్రంలో ఖానాపూర్, అంబేడ్కర్‌నగర్, సుభాష్‌నగర్, కోలిపుర, తాటిగూడ, చిల్కూరి లక్ష్మీనగర్, జీఎస్ ఎస్టేట్, అనుకుంట పార్డ్, ఖోజా కాలనీ, కుమ్మరికుంట, గాంధీనగర్, మహాలక్ష్మివాడ ఇటీవల నీట మునిగాయి.

రెండు రోజుల పాటు సర్వే..



పట్టణంలోని పలు కాలనీలు వరద నీట మునిగాయి. దీనిపై మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల్లో సర్వే చేపడుతున్నాం. ఆ తర్వాత కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్తాం.

– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

వాన తెచ్చిన నీటి కష్టం



ఈ చిత్రంలో ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులైన్ ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామ సమీపంలోనిది. ఈనెల 16న కురిసిన భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పైపులైన్ పూర్తిగా దెబ్బతింది. దీంతో మండలంలోని 73 ఆవాస ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం స్థానిక నీటి వనరులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

- 103 ఆవాసాలకు నీటి సరఫరా బంద్
- భారీ వర్షాలతో ధ్వంసమైన భగీరథ పైపులైన్‌లు
- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు తీవ్ర నష్టం
- ఇబ్బందులు పడుతున్న జనం

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు ప్రజల తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా మారగా, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. భారీ వరదల ధాటికి భగీరథ పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ఫలితంగా జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని ప్రజలకు వర్షాకాలంలోనూ తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ధ్వంసమైన పైపులైన్లను పరిశీలిస్తున్న అధికారులు జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లుగా గుర్తించిన ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించేందుకు సన్నద్ధమవుతున్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా..

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు గ్రామీణ నీటి సరఫరా శాఖపై తీవ్ర ప్రభావం చూపాయి. కుండపోత వానతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. వరద ఉధృతి కారణంగా జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసమయ్యాయి. దీంతో నీటి సరఫరాకు విఘాతం ఏర్పడింది.

- ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి సమీపంలో దెబ్బతిన్న ప్రధాన పైపులైన్ కారణంగా అత్యధికంగా ఆ మండలంలోని 73 ఆవాసా ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.
- జైనథ్ మండలంలో నాలుగు చోట్ల పైపులు చెడిపోగా అధికారులు మూడింటికి మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరించారు.
- తలమడుగు మండలంలోని 14 ఆవాసాలకు, భీంపూర్‌లో మూడు చోట్ల, నేరడిగొండ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, సిరి కొండ మండలంలో ఒక్కొక్క ఆవాసానికి నీటి సరఫరా కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు స్థానికంగా ఉన్న నీటి వనరులే పెద్ద దిక్కుగా మారాయి. కొన్ని చోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా సరఫరా చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో నీరందని దుస్థితి.



ఆర్‌డబ్ల్యూఎస్ క్షేత్రస్థాయి ఉద్యోగులు పరిశీలిస్తున్న ఈ మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ నేరడిగొండ మండలంలోని మాటుల్‌లోద్ది గ్రామ సమీపంలోనిది. వరద ఉధృతికి పైపులైన్ కనెక్షన్ విడిపోయింది. దీంతో మండల కేంద్రానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

రూ.20 లక్షల నష్టం..

జిల్లాలో వర్షాలు తెరిపివ్వడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పైపులైన్ల పరిశీలన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 21చోట్ల పైపులైన్లు పూర్తి గా ధ్వంసమైనట్లుగా గుర్తించారు. వాటికి యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా, నిధుల లేమి సమస్యగా మారనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మిషన్ భగీరథ పనులు చేపట్టిన మెగా కంపెనీ ఎలాంటి మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. ప్రస్తుతం సుమారు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లిన్నట్లు ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. ఆ వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు అందించేందుకు సిద్ధం చేశారు.

రూ.20లక్షల మేర నష్టం..

జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలుచోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసమయ్యాయి. 21 చోట్ల చెడిపోగా, సుమారు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లింది. నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టిన మెగా కంపెనీ ద్వారా యుద్ధ ప్రతిపాదికన మరమ్మతు పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక వనరుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. – బి.శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈ, ఆదిలాబాద్

గాడి తప్పుతున్న విద్యాశాఖ

- ఏడేళ్లుగా ఇన్‌చార్జి అధికారులే..!
- కొరవడిన పర్యవేక్షణ
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పలువురు ఉద్యోగులు, టీచర్లు
- ఇన్‌చార్జి బాధ్యతల్లోకి ఐటీడీఏ పీవో
- ఖుష్బూ గుప్తాపైనే ఆశలు



డీఈవో కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖ గాడి తప్పుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, అధికారుల పట్టింపులేమి వెరసీ ఆ శాఖపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏడేళ్లుగా రెగ్యులర్ డీఈవో లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఐఏఎస్ అధికారికి ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలు అప్పగించింది. ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న ఖుష్బూగుప్తాకు ఇప్పటికే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి అదనపు బాధ్యతలు సైతం ఉన్నాయి. నాలుగు కీలక బాధ్యతలు ఉండడంతో విద్యాశాఖపై ఫోకస్ పెట్టడం లేదని తెలుస్తోంది. ఈనెల 5న బాధ్యతలు స్వీకరించగా, ఇప్పటివరకు కనీసం కార్యాలయాన్ని సైతం సందర్శించకపోవడం గమనార్హం.

ఏడేళ్లుగా ఇన్‌చార్జీలే..

2018 నుంచి జిల్లాకు ఇన్‌చార్జి డీఈవోలతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోతున్నాయి. సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలున్నాయి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, కొందరు గురువులు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, తోటి ఉపాధ్యాయులతో గొడవలు పడటం, ఇష్టానుసారంగా విధులకు హాజరుకావడం, పాఠశాల నిధులు కాజేయడం, కార్యాలయ ఉద్యోగులు పలువురు అక్రమాలకు పాల్పడటం వంటివి చోటు చేసుకుంటున్నాయి. పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. 2018లో రెగ్యులర్ డీఈవోగా జనార్దన్ ఉండగా, ఆయనను సరెండ్ చేశారు. ఆ తర్వాత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవిందర్ రెడ్డి, నిర్మల్ ఏడీగా పనిచేసిన ప్రణీత ఇన్‌చార్జి డీఈవోలుగా వ్యవహరించారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఏప్రిల్ నుంచి జూలై వరకు ఇన్‌చార్జి డీఈవోగా పనిచేశారు. ఈనెల 1న ఆయనను విధులను తప్పించి ఐటీడీఏ పీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉట్నూర్‌లోనే బాధ్యతలు స్వీకరించిన సదరు అధికారి ఇప్పటివరకు జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయాన్ని సందర్శించకపోవడం గమనార్హం.

ఉట్నూర్‌కే ఫైల్స్..

జిల్లా విద్యాశాఖకు సంబంధించిన ఫైల్స్‌ను ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు ఉట్నూర్‌కు తీసుకెళ్తున్నారు. ఐటీడీఏ పీవోగా ఉన్న ఇన్‌చార్జి డీఈవో అక్కడే ఉండడంతో వారి వద్దకే ఫైళ్లను తీసుకెళ్తున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అలాగే విద్యాశాఖ నుంచి విడుదలయ్యే ప్రకటనలు, ఇతర ఉత్తర్వులు, ఫైళ్లపై సంతకాల కోసం తరచూ వెళ్లాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారి లేకపోవడంతో పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడింది. మండల విద్యాధికారులు సైతం పాఠశాలలను పూర్తిస్థాయిలో సందర్శించడం లేదు. కార్యాలయానికే పరిమితమవుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, వివిధ కార్యక్రమాల అమలుతీరు, విద్యార్థుల విద్యా ప్రగతిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఇవి నామమాత్రంగానే సాగుతున్నాయి. ఏడాదిపాటు పాఠ్యాంశాలు బోధించిన ఉపాధ్యాయులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో దగ్గరుండి మరీ మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తీర్ణతే లక్ష్యంగా ఇదివరకు పనిచేసిన అధికారులు, కొంత మంది ఉపాధ్యాయులు వ్యవహరించడంతో విద్యాప్రమాణాలు పడిపోతున్నట్లు తెలుస్తోంది. టెన్త్ పాసైనా ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. ఇదిలా ఉంటే.. విద్యాశాఖ కార్యాలయంలో కొంత మంది ఉద్యోగులు అక్రమాలకు పాల్పడటం, అందినకాడికి దండుకోవడం విమర్శలకు తావిస్తోంది. పర్యవేక్షణ కొరవడడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. రెగ్యులర్ అధికారి నియామకం చేపట్టాలని, లేదా ఖుష్బూ గుప్తా ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి డీఈవో ఖుష్బూ గుప్తాను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

సమష్టి కృషితోనే తాగునీటి సమస్య పరిష్కారం

- కలెక్టర్ రాజర్షిషా



ట్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ గ్రామంలో అందరి సహకారంతోనే తాగునీటి సమస్య పరిష్కారమైందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పంచాయతీ పరిధిలోని గొండుగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన బావితో పాటు పైపులైన్, వాటర్ ట్యాంకులను ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి బుధవారం ప్రారంభించారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఐటీడీఏ ద్వారా కొంత నిధులు, కలెక్టర్‌గా తాను కొంత నిధులు సమకూర్చి పనులు చేపట్టినట్లు తెలిపారు. అటవీశాఖ అనుమతితో పని సులభమైందన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. చిత్తగూడ సమీపంలో భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. వెంటనే మరమ్మతు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నార్నూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కలెక్టర్ వెంట డీఎఫ్‌వో బాజీరావ్ పాటిల్, ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, డీఈఈ శ్రీనివాస్, ఐటీడీఏ డీఈఈ శివప్రసాద్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో గంగాసింగ్, ఎంఈవో అనిత, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. బుధవారంమండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల గోదాంలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఎరువులు సకాలంలో అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.


ఆయన వెంట ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్ తదితరులున్నారు.

వరద నష్టంపై తక్షణ సర్వే

కైలాస్‌నగర్: వరద ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు తక్షణ సర్వే నిర్వహించి నష్టం అంచనాలతో కూడిన నివేదికలు పక్కాగా సమర్పించాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేపట్టి త్వరితగతిన రాకపోకలు పునరుద్ధరించాలన్నారు. సర్వే సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతోపాటు శాశ్వత పరిష్కారానికి మండల,జీపీల వారిగానివేదికలు అందించాలని తెలిపారు. ఈ సర్వేపై సూపర్ చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పంట బీమా కల్పించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



రైతులు నష్టపోయారని మొక్కలు చూపుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: రైతులందరికీ పంట బీమా కల్పించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటలకు బీమా ఉంటేనే రైతులు ధీమాగా వ్యవసాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులకు రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తే ఎటూ సరిపోదన్నారు. నష్టపోయిన రైతులందరికీ విత్తనాలు సబ్సిడీపై అందించాలన్నారు. అలాగే కోతకు గురైన భూములను చదును చేసుకునేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బ్రహ్మానంద్, జోగు రవి, మటోలియా, సంతోష్, రాకేష్, దయాకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లాలో రేపు ‘ఉపాధి’ జాతర

- ఒకే రోజు రూ.8.25 కోట్ల విలువైన పనులకు భూమిపూజ

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఏడాదిలో వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. పంచాయతీల అభివృద్ధిలో ప్రజలను మరింత భాగస్వామ్యులను చేసేందుకు గాను పనుల జాతర-2025 పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 22న ఒక్క రోజే జిల్లాలోని 473 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.8కోట్ల 25లక్షల 88వేల 500 నిధులతో కూడిన పలు రకాలైన 2,295 అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నూతన గ్రామ పంచాయతీలు,అంగన్‌వాడీలు, ప్లాస్టిక్‌వేస్ట్ యూనిట్స్, సెగ్రిగేషన్ షెడ్స్, కమ్యూనిటీ శానిటరీకాంప్లెక్స్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంత రోడ్లకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు, సీఆర్‌ఆర్, ఎంఆర్‌ఆర్ సీసీ రోడ్లు, పొలంబాట పనులు చేపట్టనున్నారు. అలాగే ఇందిరా మహిళాశక్తి – ఉపాధి భరోసా కింద పశువుల కొట్టాలు, కోళ్ల, గొర్రెలషెడ్లు, కొత్త వ్యవసాయ బావుల నిర్మాణాలు, పండ్ల తోటల పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ నిర్మాణాలు, అజోల పిట్ల నిర్మాణాలకు ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టనున్నారు. జిల్లాలోని ఒక్కో మండలంలో రెండేసి గ్రామాల్లో పనులు ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఆయా గ్రామీణ మండలాల పరిధిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్డీవో రాథోడ్ రవీందర్ తెలిపారు.

పర్యావరణహితాయ.. పార్వతి తనయా

- మట్టి వినాయకులకు పెరుగుతున్న ప్రాధాన్యత
- విభిన్న ఆకృతుల్లో దర్శనమిస్తున్న లంబోదరుడు
- ఉపాధి పొందుతున్న పలువురు కళాకారులు

ఆదిలాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు గణనాథుని ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. జిల్లా కేంద్రం వ్యాప్తంగా మట్టి ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. ఎంతోమంది కళాకారులకు ఉపాధి అందిస్తున్నాయి. వైవిధ్యమైన రూపాల్లో పార్వతి తనయున్ని పర్యావరణహితంగా ప్రతిష్ఠించేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి మట్టి వినాయక ప్రతిమలను నిలబెట్టేందుకు యువత, ఉత్సవ సమితి సభ్యులు ప్రాధాన్యత నిస్తుండడం విశేషం. పీఓపీ విగ్రహాలు తక్కువ సమయంలో పూర్తవుతాయి. మట్టి ప్రతిమల తయారీకి 10 నుంచి 20 రోజులు పడుతుంది. అయినప్పటికీ నిర్వాహకులు వైవిధ్యమైన రూపాల్లో మట్టి వినాయకున్ని కొలువుదీర్చేందుకు ఆర్డర్లు ఇస్తుండడం గమనార్హం. దీంతో కళాకారులకు చేతినిండా పని దొరుకుతోంది. మరోవైపు పర్యావరణ పరిరక్షణ సైతం సాధ్యమవుతుండడంతో పర్యావరణ ప్రేమికుల నుంచి సైతం హర్షం వ్యక్తం అవుతుంది.


మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

ఆదరణ పెరిగింది



గతంతో పోలిస్తే పీఓపీ విగ్రహాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వైవిధ్యమైన ప్రతిమలు తయారు చేయాలంటే మట్టితో మాత్రమే సాధ్యమవుతుంది. దీంతో మట్టి వినాయక విగ్రహాలకు ఆదరణ పెరిగింది. మట్టి ప్రతిమలు తయారు చేసేందుకు 10 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. ముందుగానే ఆర్డర్ ఇస్తే మరిన్ని ప్రతిమలు తయారు చేసే అవకాశం ఉంటుంది.

– ఎగిడి రవి కుమార్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

నల్లమట్టి దొరకడం లేదు..



పది సంవత్సరాల వయస్సు నుంచే విగ్రహాల తయారీలో పాల్గొంటున్నా. నేను ఉద్యోగం చేస్తూనే.. మా కులవృత్తిని కాపాడుకునేందుకు విగ్రహ తయారీని కొనసాగిస్తున్నా. గతంలో స్థానికంగానే దొరికే నల్లమట్టితో విగ్రహాలను తీర్చిదిద్దే వాళ్ళం. అయితే ఇప్పుడు నల్ల మట్టి కరువైపోయింది. స్థానికంగా దొరకడం లేదు. దీంతో మహారాష్ట్రలోని అమరావతి నుంచి మట్టిని కొనుగోలు చేస్తున్నాం. – ప్రశాంత్ కుమార్, విగ్రహ కళాకారుడు

విగ్రహాల తయారీలో నిమగ్నం


మట్టితో తయారు చేస్తున్న వినాయకుడు

కాగజ్‌నగర్‌టౌన్: వినాయక చవితి సమీపిస్తుండడంతో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. పట్టణంలోని పెట్రోల్‌పంప్ ఏరియా, మార్కెట్, మండలంలోని నజ్రుల్‌నగర్, రాంనగర్, విలేజీనెం 5, చింతగూడ గ్రామాల్లో మట్టి వినాయకుల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి



చిన్ననాటి నుంచే విగ్రహాల తయారీపై ఆసక్తితో చిన్నచిన్న గణపతులను తయారు చేసి ఇంట్లో పూజించేవాళ్ళం. 23 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నా. భక్తులను ఆకర్షించేలా వివిధ డిజైన్లలో, హనుమంతుడిపై వినాయకుడు, రామసేతు వినాయకుడులాంటి రూపాల్లో బంక మట్టి, సహజ సిద్ధమైన రంగులతో 5 నుంచి 20 ఫీట్ల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నా. ఈ ఏడాది ఇందిరా మార్కెట్ భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నా.

– గౌత్రే విక్రమ్, కళాకారుడు, కాగజ్‌నగర్

పర్యావరణ పరిరక్షణకు..



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను తయారు చేస్తున్నా. వినాయకుడి విగ్రహాలతో పాటు దుర్గాదేవి విగ్రహాలను కూడా తయారు చేస్తా. పదోతరగతి తర్వాత మట్టి విగ్రహాలను ఇంట్లో తయారు చేసేవాడిని. ఇప్పుడు 12 ఫీట్ల వరకు వినాయ విగ్రహాలను తయారు చేస్తున్నా. పట్టణంలోని త్రినేత్ర శివాలయంలో వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్టిస్తాం

– ములుకుట్ల జశ్వంత్, ఆదర్శనగర్, కళాకారుడు

వారసత్వం కొనసాగిస్తున్నాం..



సంప్రదాయ బద్ధంగా తాతలు నేర్పిన కళను ముందుకు తీసుకెళ్తున్నాం. సాధారణ రోజుల్లో ఉద్యోగాలు చేసుకుంటూ, ప్రత్యేక పర్వదినాల సమయంలో విగ్రహాల తయారీ చేపడుతున్నాం. నిర్మల్ ప్రాంతంలో మావారు కొయ్య బొమ్మలు తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో మేము ఎక్కువగా వినాయకచవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాల సమయంలో, బోనాల సమయంలో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– చంద్రశేఖర్, విగ్రహ కళాకారుడు, ఆదిలాబాద్

కళాకారులను ఆదుకోవాలి



సీజన్ సమయంలో మాత్రమే ఉపాధి దొరుకుతుంది. దీంతో మాలాంటి కళాకారులంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి కళాకారులపై దృష్టి సారించాలి. ప్రోత్సాహకాలను అందించడంతోపాటు, ఏవైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు అండగా నిలబడాలి. ప్రస్తుతం నేను 54 అడుగుల విగ్రహాన్ని తయారు చేస్తున్నా. విగ్రహాల ఎత్తు పెరుగుతుంది తప్పితే మా జీవితాల్లో మాత్రం ఎదుగుదల కనిపించడం లేదు.

– ఊరే గణేశ్, విగ్రహ కళాకారుడు

నిర్మల్‌లో పదేళ్లుగా...


మట్టి వినాయకుడి తయారీలో కళాకారుడు గోపి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణం గతం నుంచీ మట్టి గణపతుల తయారీకి ప్రసిద్ధి గాంచింది. జిల్లా కేంద్రానికి చెందిన కోటగిరి గోపి పదేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. అతని కుమార్తె మంజుశ్రీ తయారైన మట్టి విగ్రహాలకు డిజైనింగ్ చేస్తుంది. కుమారుడు గణిత్ వారికి సహాయపడుతుంటాడు. సుమారు 30 విగ్రహాలను తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేస్తుంటారు. ఇవి మూడు ఫీట్ల నుంచి ఏడు ఫీట్ల వరకు ఉంటాయి. మట్టి గణపతుల తయారీలో చెరువుల నుంచి తెచ్చిన బంకమట్టి, ఎండిన వరిగడ్డి, తవుడు, ఊబక, కట్టెపొడి, వెదురు బొంగులు వాడుతున్నారు. ఇవన్నీ పర్యావరణహితమని చెబుతున్నారు. వీటిని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఇవన్నీ తేలికగా నీటిలో కరిగిపోతాయి. డిజైన్, సైజ్ ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ధరలు ఉన్నాయి.

వినాయకుడు అంటేనే ప్రకృతి..



హిందూ సంప్రదాయం ప్రకారం మట్టి గణపతినే పూజించాలి. గణపతి పూజ అంటే ప్రకృతికి పూజ అని అర్థం. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ అఫ్ పారిస్ గణపతులతో వాతావరణం కలుషితం అవుతుంది. కాబట్టి మన ధర్మాన్ని మనం పాటించాలి.

– కోటగిరి గోపి, విగ్రహ కళాకారుడు, నిర్మల్

మట్టి మేలు తలపెట్టి..!

మంచిర్యాలఅర్బన్: సంప్రదాయంగా వస్తున్న పండుగలను ప్రస్తుతం జరుపుకునే విధానంలో చేస్తున్న పొరపాట్లు పర్యావరణానికి ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి. వినాయక చవితి రోజు చేస్తున్న పొరపాట్లు చీకట్లు మిగుల్చుతున్నాయి. కానీ.. వినాయక చవితి అనగానే ఆకర్షణ, హంగు, ఆడంబరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొన్నేళ్లుగా రంగుల వినాయకులకు తీసిపోకుండా వివిధ రూపాలతో భక్తులను ఆకట్టుకునే విధంగా మట్టి గణపయ్యలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి అనుకూలంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కులవృత్తులు కాపాడుతూ.. ఉపాధినిస్తూ

కనుమరుగవుతున్న కులవృత్తిని కాపాడాలనే సదుద్దేశంతో మట్టి వినాయకుల తయారీతో పాటు ఎంతోమందికి ఉపాధినిస్తున్నారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన నాగపూరి రాజేంద్రప్రసాద్ మంచిర్యాలలోని సున్నబట్టీవాడలో నివాసం ఉంటున్నారు. ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసిన ఆయన కులవృత్తితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఆలోచన చేశారు. 2015లో ఏడు మట్టి విగ్రహాలు తయారీ చేసి విక్రయించారు. 2018లో 52 మట్టి ప్రతిమలను రూపొందించి పర్యావరణ హితానికి నడుం బిగించారు. ప్రస్తుతం శ్రీగణేష్ క్లే వర్క్ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. దాదాపు 80 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు.


మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు

మున్ముందు దీపావళికి ఉపయోగించే ప్రతిమలు, ఇంట్లో వినియోగించే మట్టిపాత్రలు, కుండలు ఇలా అన్ని రకాలు తయారీ చేయాలని నిర్ణయించారు.

మట్టివిగ్రహాలతో ఆదాయం భళా..

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల తయారీ సరఫరా టెండర్ దక్కించుకున్నారు. 40వేల వినాయకులు సరఫరా చేయనున్నారు. మరోవైపు రెండో అన్నవరంగా పేరొందిన గూడేం సత్యనారాయణ టెంపుల్‌లో ఏర్పాటు చేసే మట్టి వినాయకుడు ఇక్కడే తయారు చేశారు. ఆదిలాబాద్ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 2వేల మట్టి వినాయకుడు ఆర్డర్ ఇచ్చింది. ఎనిమిది నుంచి తొమ్మిది అడుగుల ఎత్తులో మట్టి వినాయకులు తయారు చేశారు. వినాయకుల తయారీలో కర్ర, మట్టి, గడ్డితో తడి సున్నం, వాటర్ కలర్‌లు వినియోగించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

పదిహేనేళ్లుగా తయారీ



చెన్నూర్: పర్యావరణ పరిరక్షణేలక్ష్యంగా పది హేనేళ్లుగా మట్టి విగ్రహాలు త యారు చేస్తున్నా. ప్రతియేటా వంద మట్టి విగ్రహాలు త యారు చేస్తుంటా. మట్టిని తీసుకొచ్చి స్వయంగా నెల రోజుల వరకు విగ్రహాలను తయారు చేస్తా. మట్టి ఖర్చులు తీసుకొని విగ్రహాలు ఇస్తాను. కొన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నా. ఇప్పటి వరకు మూడు ఫీట్ల ఎత్తు విగ్రహాలు చేస్తున్నా. రానున్న రోజుల్లో పది ఫీట్ల ఎత్తు విగ్రహాలు తయారు చేస్తాను.

ప్రభుత్వం పర్యావరణంతోపాటు కులవృత్తులను ప్రోత్సహించటానికి ప్రభుత్వ స్థలం లీజుకు ఇస్తే మరింత మందికి ఉపాధినిస్తానని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

తాతల కాలం నుంచి..

తాతల నుంచి వచ్చిన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని మట్టి వినాయకులు తయారీ చేసి ఆదర్శంగా నిలుస్తున్నాడు మంచిర్యాలకు చెందిన తాళ్లపల్లి తిరుపతి. ఇంటర్ పూర్తి చేసి కులవృత్తి మట్టికుండల తయారీలో తర్ఫీదు పొందాడు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికుల సహకారంతో ఏటా 2వేల విగ్రహాలకు పైన మట్టి విగ్రహాలు తయారు చేసి ఆర్డర్‌పై ఇస్తుంటాడు. మూడు కుటుంబాలు మట్టి వినాయకుల తయారీలో పాలు పంచుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. చిన్న విగ్రహాలను చూడముచ్చటగా తీర్చిదిద్ది మార్కెట్లో విక్రయిస్తుంటా రు. మట్టికి సులువుగా కరిగే గుణం ఉంటుంద ని, విగ్రహాల తయారీలో చెరువు మట్టి వినయోగంతో పూడిక సమస్య తొలగిపోతందుని అందుకే మట్టికి ప్రాధాన్యం ఇస్తున్నామని తిరుపతి తెలిపారు. వినాయక చవితి పర్యావరణానికి పూర్తిగా మేలు చేసే పండుగని, మట్టితో పూజించాలని సూచించారు.


తిరుపతి తయారు చేసిన మట్టి విగ్రహాలు

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


లక్ష్మన్న (ఫైల్)

నేరడిగొండ: అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య చేసున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన పోతగంటి లస్మన్న (37) మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఏడాది క్రితం తిరిగి వచ్చాక తనకున్న అర ఎకరంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేపట్టాడు. అయితే గతేడాది సరైన దిగుబడి రాలేదు. ఈ సారి మళ్లీ పత్తి సాగు చేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట పూర్తిగా నీట మునిగింది. గతంలో దుబాయ్ వెళ్లేందుకు, వచ్చాక సాగు కోసం చేసిన అప్పు (ప్రైవేట్‌లో) మొత్తం రూ.5లక్షల వరకు చేరింది. ఈ క్రమంలో అది ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడు ..

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గాదె రాజేశ్ (28) బుధవారం మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తాత్విక'ముని'కి కీర్తి పురస్కారం


రాజారావు

నిర్మల్‌ఖిల్లా: ప్రముఖ తాత్విక కవి, రచయిత మునిమడుగుల రాజారావుకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది. ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాలను అందిస్తోంది. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం పురస్కార వివరాలను ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలం తంగళ్ళపల్లికి చెందిన రాజారావు యుక్తవయసునుంచే సాహిత్య పఠనం తాత్విక రచనల ద్వారా విశేషంగా పేరు గడించారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. అనాగరిక గేయం, నేను ఎవరు..?, దుఃఖ నది, హూ ఎమ్ ఐ, సత్యం వైపు పయనం వంటి అనేక రచనలతో సాహితీ రంగంలో తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. పలు రచనలు ఆంగ్లంలోనికి అనువాదమయ్యాయి. గతంలోనూ తన రచనల ద్వారా అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారంతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందుకోనున్నారు.

'కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలు'


మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

ఇచ్చోడ: కాంగ్రెస్, బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీలని బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ నిషాని రాంచంద్రం ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కమిటీల పనితీరు, పార్టీ బలోపేతం విధివిధానాలను సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 1950 నుంచి 93 వరకు బీసీలకు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎలాంటి రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల సతీశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, స్టేట్ ఈసీ మెంబర్ మెస్రం జంగుబాబు, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షులు జగన్, ముక్కల రాజేంద్రప్రసాద్, రత్నపురం రమేశ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు


దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, ఇటిక్యాల్ తాండ, పెంబి తాండ, తాటిగూడ గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ గంగారెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అభిషేకర్ తెలిపారు. వారి వద్ద నుండి 20 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, సాయి, రాజేందర్, రవీందర్, నిరోషా, రవి, అశ్వక్, జమీర్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ ఎదుట ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన షేక్ మసూద్, మహారాష్ట్రలోని బోకర్ తాలుకా చిక్కల్‌వాడికి చెందిన జుబేర్ ఫారుక్ పఠాన్ గంజాయి విక్రయిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్, సిబ్బంది సుధాకర్ రెడ్డి, వినాయక్, గోపాల్, నరేందర్, సంజీవ్, క్రాంతి అనుమానం వచ్చి వారిని విచారించారు. వారి వద్ద 243 గ్రాము ల ఎండు గంజాయి లభ్యం కావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నలుగురు పాత నేరస్తులను బుధవారం తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేసినట్లు టూటౌన్ ఎస్సై సీహెచ్ కిరణ్ కుమార్ తెలిపారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తుగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీకి యత్నించిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పరిధిలో గల శ్రీనివాస వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. ఐదుగురు వ్యక్తులు వైన్స్ వెనుక గల గోడకు కన్నం వేసి లోనికి ప్రవేశించేందుకు యత్నించారు. అదే సమయంలో అటుగా వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరారయ్యారు. పట్టణంలోని వడ్డెరకాలనీకి చెందిన షేక్ బిలాల్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన మహ్మద్ షారుక్ ఖాన్‌లను పంజాబ్ చౌక్‌లో మంగళవారం పట్టుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

భుజంపై వాగు దాటించి..



కెరమెరి మండలంలోని బోరిలాల్‌గూడకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పవార్ కవిత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆస్పత్రికి వెళ్దామంటే ఇటీవల కురుస్తున్న వర్షాలకు మధ్యలో ఉన్న అనార్‌పల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఇంటివద్దే ఉంటోంది. బుధవారం జ్వర తీవ్రత పెరగడంతో సొమ్మసిల్లి పడిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఆమెను భుజంపై ఎక్కించుకుని అతికష్టం మీద వాగు దాటించారు. కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – కెరమెరి

ప్రకృతి ఒడిలో పాలధార



సొనాల మండలంలోని ఘన్‌పూర్ జలపాతం పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. వర్షాకాలపు కొత్తదనాన్ని నింపుకుని తన సమ్మోహన అందాలతో చూపులను కట్టిపడేస్తోంది. మహారాష్ట్ర సరిహద్దులో ఘన్‌పూర్ గ్రామానికి కిలోమీటరు దూరంలోనే పచ్చని ప్రకృతి ఒడిలో ఈ అద్భుత దృశ్యం దాగి ఉంది. పైనుంచి కిందకు జాలువారుతున్న జలధార చూపరులకు కనువిందు చేస్తోంది.

– బోథ్

బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఒకరి రిమాండ్

నేరడిగొండ: ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్న శేఖర్ అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. గత రెండు సంవత్సరాల క్రితం బాధితురాలు ఖానాపూర్ వద్ద గల గంగానదికి వెళ్ళిన సమయంలో సమీప బంధువైన శేఖర్ తన సెల్‌ఫోన్లో వీడియోలు తీశాడు. ఇటీవల వాటిని ఆమె భర్త స్నేహితుడికి వాట్సాప్‌లో పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.